



# బలి

- బి.వి.భద్రగిరీష్

విజయవాడలోని ఆటోనగర్ ప్రాంతం. ఇనుప సామాన్ల పనులు చేసుకొనే సిక్కుల కుటుంబాలు కొన్ని అక్కడ ఉన్నాయి. ఇలాంటివాళ్ళు రాష్ట్రంలోని ఇతర పట్టణాలలో కూడా కనిపిస్తుంటారు. పాత ఇనుప సామాన్లు పగలకొట్టి కత్తులు, కొడవళ్ళు, గమేళాలు వంటివి తయారుచేసి అమ్మి పొట్టపోసుకుంటుంటారు.

తన గుడిసె ముందు కూర్చొని పాత ఇనప రేకుని సుత్తితో కొట్టి గమేళాగా మారుస్తున్నాడు వీర్ సింగ్. ఇనప రేకుని గమేళాగా మార్చే పని అలవాటుగా సాగుతోంది కానీ, అతడి మనసు పని మీద లేదు. అతడికిప్పుడు అర్జెంటుగా అయిదువేలు కావాలి. "అందరికీ తెల్లరేషన్ కార్డులు ఇస్తున్నారు, మనం కూడా తీసుకొందాం" అని అతడి భార్య చమ్కీ పోరుపెడుతోంది. కార్డు కోసం కార్పొరేటర్‌ని అడిగితే అయిదువేలు ఖర్చు అవుతుందని చెప్పాడు. ఉన్నట్టుండి అంత డబ్బు ఎక్కడనుంచి వస్తుంది? చేస్తున్న పనిలో మిగిలేదేమీ లేదు. రోజుకు పది గమేళాలు అమ్మితే వంద రూపాయలు మిగుల్తాయేమో! అమ్ముడవకపోతే అదీ లేదు.

ఇంతలో, "అజీ, అందర్ ఆవో, చాయ్ పీకే చలో.." చమ్కీ పిలిచింది. చేస్తున్న పనిని ఆపి చెమటను తుడుచుకుంటూ పైకి లేచాడు వీర్ సింగ్. గుడిసెలో మంచం మీద కూర్చొని చాయ్ తాగుతుండగా "అరె వీర్, కహా హోరే!" అంటూ బయటనుంచి పిలుపువినబడి, గుడిసెలోనుంచి బయటికి తొంగి చూశాడు. పిలుస్తున్నది కేసర్‌సింగ్. "ఆవో మామూ, చాయ్ తాగి వెళ్ళు" పిలిచాడు వీర్‌సింగ్. "నహీ రే, జరూర్ పని వుంది, జల్దీ చాయ్ తాగి రా" ఆదేశంలాగా చెప్పాడు. రెండు గుక్కల్లో చాయ్ తాగి బయటకు వచ్చాడు వీర్‌సింగ్. కేసర్ వెనకాలే అనుసరించాడు. రోడ్డు చివరలో ఉన్న తన గుడిసె దగ్గరకు వీర్‌సింగ్‌ను తీసుకెళ్ళాడు కేసర్. అక్కడ గుడిసె బయట మంచంపై కూర్చొని ఉన్నాడు డ్రమ్ముల శీను. అతడికి వీర్‌సింగ్‌ను పరిచయం చేశాడు కేసర్. శీను పక్కన కూర్చొని లోగొంతుకతో మాట్లాడడం మొదలుపెట్టాడు. డ్రమ్ముల శీను విజయవాడలో పాత సామానుల వ్యాపారంచేస్తూ వుంటాడు. తమకు అవసరమైనప్పుడు పాత ఇనుప డ్రమ్ములు అతడి దగ్గరే తెచ్చుకుంటుంటారు. శీనూ, కేసర్‌సింగ్ మంచి దోస్తులని వీర్‌సింగ్‌కు తెలుసు.

ఇద్దరి సంభాషణ వింటూ నిలబడ్డాడు. కాసేపటికి ఇవతలికి వచ్చాడు కేసర్. "వందదాకా పాత ఇనప డ్రమ్ములున్నాయిట. వాటిని పగలగొట్టి మెటీరియల్ పారబోసేసి రేకుల కింద కత్తిరించాలి. రేకుల్ని మనల్నే తీసేసుకోమంటున్నాడు శీను. డ్రమ్ముకు రెండువందల యాభై అడిగాను. రెండువందలు ఇస్తానంటున్నాడు, నువ్వేమంటావ్?" అడిగాడు. "డ్రమ్ములలో ఏం వుంది?" అడిగాడు వీర్‌సింగ్. "పాడైపోయిన పెయింట్!" చెప్పాడు కేసర్. "మామూ! నాకు పైసల జరూరత్ వుంది. మంచి బేరం. రెండువందలకు వప్పుకో! నేను పని చేసిపెడతాను." చెప్పాడు వీర్. అతడి భుజంతట్టి శీను దగ్గరికి వెళ్ళాడు కేసర్. "ఈ పైసల్ వస్తే కార్పొరేటరుగాడికి ఇయ్యాలె, తెల్లకార్డు కోసం పాంచ్ హజార్ అడిగిండు, నాకొడుకు..." అనుకొన్నాడు. "డ్రమ్ములు హైదరాబాదునుండి వస్తాయి. మిర్యాలగూడ దాటిన తర్వాత సిమెంటు ఫ్యాక్టరీల వారిని వదిలేసిన గనులు ఉన్నాయి. అక్కడంతా ముళ్ళకంపలు ఉంటాయి. ఎవరూ ఉండరు. ఆ గుంటల్లో పారబోసేయండి. ఆ ఫ్యాక్టరీల వారితో నేను మాట్లాడాను. రేపు బయల్దేరి రాత్రికల్లా మిర్యాలగూడ వచ్చేయండి. రాత్రికి డ్రమ్ములతో బండి అక్కడికి వస్తుంది. పొద్దునకల్లా పని పూర్తికావాలి." రెండువేల రూపాయలు ఎడ్వాన్సుగా ఇచ్చి వెళ్ళిపోయాడు శీను.

కొన్ని రోజుల ముందు, హైదరాబాద్ నగర శివార్లలో ఉన్న ఒక ఫార్మాస్యూటికల్ కంపెనీలో...

వ్యక్తిగత పనిమీద వారంరోజులు సెలవు తర్వాత, ఆరోజే కంపెనీలో డ్యూటీకొచ్చాడు కృష్ణ. కార్డు పంచ్ చేసిన తర్వాత ఉత్పత్తిచేసే బ్లాకులో షిఫ్టు ఆపరేటరు నుండి ఛార్జిని తీసుకోవడానికి వెళ్ళాడు. పక్క బ్లాకు ఆపరేటరైన వెంకటేశ్వరరావు అతడిని చూసి దూరం నుండి చెయ్యి ఊపుతూ పలకరించాడు. తనుకూడా చెయ్యి ఊపి బ్లాకులోకి వెళ్ళాడు కృష్ణ. ఛార్జి హ్యాండోవరు చేసుకొని, రియాక్టర్లవద్ద పనిలో పడ్డాడు. తమ బ్లాకు దగ్గర కాంపౌండువాల్ పక్కన ఉండే స్థలం ఖాళీగా ఉండడం చూసి ఆశ్చర్యపోయాడు. చాలారోజులనుంచి ఆ స్థలంలో కంపెనీ ఉత్పత్తి క్రమంలో విడుదలైన వ్యర్థరసాయనాలను నిల్వచేసిన పాత ఇనప డ్రమ్ములు సుమారు వందదాకా ఉండేవి. తమ బ్లాకులో పనులు సజావుగా సాగడానికి ఆ డ్రమ్ములు అడ్డంగా ఉండేవి. అప్పుడప్పుడు ఈ డ్రమ్ములనుండి భరించలేని దుర్వాసన వస్తుండేది. మందుల కంపెనీలో పనిచేసే తమకు వాసనలు కొత్త కాకపోయినా, చాలాకాలం నుంచి ఉంచడంవల్లనేమో, అందులో ఉన్న రసాయనాలు మురిగిపోయి, వాసన భరించలేనిదిగా ఉండేది. ఆ డ్రమ్ములను అక్కడినుండి తీసేయించమని ప్లాంటు మేనేజరుకు చెప్పి చూశాడు కానీ, అతడు పట్టించుకోకపోవడంతో ఊరకుండిపోయాడు. అలాంటిది ఇవాళ చూస్తే డ్రమ్ములు అక్కడలేవు. స్థలం ఖాళీగా ఉంది.

లంచవర్లో క్యాంటీన్లో వెంకటేశ్వరరావు కోసం వెతికాడు కృష్ణ. వెంకటేశ్వరరావు కంపెనీలో కృష్ణ కంటే సీనియర్. ఇద్దరిదీ ఒకే ఊరు కావడంతో స్నేహం కుదిరింది. ఏ విషయమైనా వెంకటేశ్వరరావు సలహాలు తీసుకోవడం కృష్ణ అలవాటు. వెంకటేశ్వరరావు కనబడడంతో, తన బాక్స్ తీసుకొని వెళ్ళి అతడి పక్కన కూర్చున్నాడు కృష్ణ. పిచ్చాపాటీ మాటలు అయిన తర్వాత డ్రమ్ముల విషయం ప్రస్తావనకు వచ్చింది. డ్రమ్ములేమయ్యాయని అడిగాడు కృష్ణ. "ఓహో! నువ్వు వారంరోజుల నుంచీ లేవుకదా. ఇక్కడ జరిగింది నీకు తెలియదు. ఏముందీ, డ్రమ్ములు బయటకు వెళ్ళిపోయాయి." చెప్పాడు వెంకటేశ్వరరావు తేలికగా.

"అంటే?" అర్థంకాక అడిగాడు కృష్ణ.

"బయటకు అంటే బయటకే" అన్నాడు వెంకటేశ్వరరావు అదోలా నవ్వుతూ.

"అదేమిటి? వాటిని పంపాల్సింది వ్యర్థపదార్థాల నిల్వ ప్రాంతానికికదా? వేరేచోటికి ఎలా పంపుతారు?" అడిగాడు కృష్ణ.

"ఓయ్... ఓయ్... నీకు కొంచెం కొత్తలే! వ్యర్థ పదార్థాల నిల్వ ప్రదేశానికి శుద్ధికోసం పంపిస్తే డ్రమ్ముకి అయిదువేల రూపాయల దాకా ఖర్చవుతుంది. అదే బయటకు అయితే అయిదువందల రూపాయలతో ఫినిష్.." అంటూ కిటికీలోంచి బయటకుచూసిన వెంకటేశ్వరరావు కళ్ళు మెరిశాయి. కృష్ణ చెవి దగ్గరకు వంగి లోగొంతుకతో, "అలా కిటికీలోంచి బయటకు చూడు. ప్లాంటు మేనేజరు కనబడ్డాడా?" అడిగాడు వెంకటేశ్వరరావు. "ఆ!" అన్నాడు కృష్ణ. "ప్లాంటు మేనేజరు కూడా ఉన్నవాణ్ణి చూశావా? వాడి పేరు డ్రమ్ముల శీను. పాత సామాన్ల బిజినెస్ చేస్తాడు. వాడి లాంటి వాటిల్లో సిద్ధహస్తుడు. వారంనుంచీ వాళ్ళిద్దరూ ఇదే పన్లో ఉన్నారు. మనం తయారుచేసే మందుల్ని దిగుమతి చేసుకొనే అమెరికా కంపెనీనుంచి ఆడిటర్లు వచ్చేవారం వస్తున్నారుట. కంపెనీ శుభ్రంగా లేకపోతే వాళ్ళు ఆర్డర్లు ఇవ్వరు. అందుకని మేనేజరు ప్లాంటును శుభ్రంచేయించే పనిలో ఉన్నాడు. మామూలుగా అయితే వ్యర్థాలను శుద్ధిచేసి నిల్వచేసే ప్రదేశానికి

పంపించాలి. కానీ, డ్రమ్ముకి అయిదువేలు ఖర్చయ్యే చోట అయిదువందల రూపాయల్లో సరిపెట్టానని చూపించి ప్లాంటు మేనేజరు మేనేజిమెంటు దగ్గర క్రెడిట్ కొట్టేస్తాడు. ఇంకా కుదిరితే వైస్ ప్రెసిడెంట్ ప్రమోషను కూడా..."

"అమెరికన్ కంపెనీ వాళ్ళు ఏ ప్రోడక్టుకి ఆర్డరు ఇస్తున్నారో తెలిసిందా?" సహజమైన కుతూహలంతో అడిగాడు కృష్ణ.

"గత నెలరోజులుగా మనం ఒక ప్రోడక్టు గురించి ట్రయల్సు వేశామే, దానికే".

"అదేమిటి, ఆ ప్రోడక్టు తయారీ క్రమంలో వ్యర్థాలు ఎక్కువగా వస్తున్నాయని తెలిసిందిగా, అలా అనే మనం మేనేజిమెంటుకు రిపోర్టు ఇచ్చాము గదా?"

"అందుకే ఆ కంపెనీ వాళ్ళు ఆ ప్రోడక్టు తయారీకి మనకు ఆర్డరు ఇస్తున్నారు. ఎక్కువ కాలుష్యం విడుదలయ్యే ఉత్పత్తుల్ని వాళ్ళ తయారుచేయకుండా మన దగ్గర తయారుచేయించి తీసుకెళ్తారన్నమాట. ఉత్పత్తి వాళ్ళది, కాలుష్యం మనది" నవ్వాడు వెంకటేశ్వరరావు.

"పోనీలే, ఎలాగైతేనేం కంపెనీకి ఆర్డర్లు వస్తున్నాయి. ఇప్పుడైనా జీతాలు సరిగ్గావస్తే అంతే చాలు. కానీ డ్రమ్ములను తరలించేటప్పుడు ఎవరైనా పట్టుకుంటే?" కృష్ణ అడిగాడు. పెద్దగా నవ్వాడు వెంకటేశ్వరరావు. "డబ్బుకు లోకం దాసోహమోయ్.. కుదరకపోతే మినిస్టరు నుంచి ఫోన్లు.. మన యండీగారికి మినిస్టరు బంధువని మర్చిపోయావా?"

"శుద్ధిచేసి నిల్వచేయాల్సిన రసాయన వ్యర్థాలు ఇలా ఎక్కడబడితే అక్కడ పారబోస్తే ప్రమాదం కాదా?"

"ప్రమాదమే, చాలా ప్రమాదం. అవి పారబోసిన చోట చెట్లన్నీ చచ్చిపోతాయి. వర్షం పడితే ఇంకా ప్రమాదం. ఈ రసాయనాలు వర్షం నీళ్ళతో కలిసి చుట్టుపక్కల ఉన్న చెరువులోనో, వాగులోనో కలుస్తాయి. ఆ నీళ్ళు తాగిన మనుషులు కానీ, పశువులు కానీ ఇక అంతే! అయితే పారబోసినట్టు తెలీకుండా ఉండడానికి వీళ్ళు ఎవరూ తిరగని నిర్జన ప్రదేశాలు లేదా అడవి ప్రదేశాలు వెతుక్కుంటారు. అలాగే వివరాలు తెలీకుండా ఉండడానికి చదువురాని, కూలీ పని చేసుకునే వాళ్ళను ఉపయోగిస్తారు. అబ్బో, ఇదంతా ఒక మాఫియా టైపులే. డ్రమ్ముల శీను పెద్ద కిలాడీ. వాడికి ఇలాంటివన్నీ కొట్టిన పిండి.." భోజనం పూర్తికావడంతో ఇద్దరూ తమ బ్లాకులవైపు బయల్దేరారు.

మరుసటి రోజు, విజయవాడ నుండి బయల్దేరి సాయంత్రానికల్లా మిర్యాలగూడ చేరుకున్నారు వీర్ సింగ్, కేసర్‌సింగ్. నాలుగు విస్కీ బాటిళ్ళు, బిర్యాని పొట్లాలు, నీళ్ళ పాకెట్లు తీసుకొని బైపాస్ రోడ్డులో ఎదురుచూడసాగారు. శీను చెప్పిన గుర్తుల ప్రకారం డ్రమ్ములను తీసుకొని లారీ వచ్చింది. లారీలోకి ఎక్కి, సిమెంటు ఫ్యాక్టరీల గనులవైపు బయల్దేరారు. మెయిన్

ఈ రసాయనాలు వర్షం నీళ్ళతో కలిసి చుట్టుపక్కల ఉన్న చెరువులోనో, వాగులోనో కలుస్తాయి. ఆ నీళ్ళు తాగిన మనుషులు కానీ, పశువులు కానీ ఇక అంతే! అయితే పారబోసి నట్టు తెలీకుండా ఉండడానికి వీళ్ళు ఎవరూ తిరగని నిర్జన ప్రదేశాలు లేదా అడవి ప్రదేశాలు వెతుక్కుంటారు.

రోడ్డులోంచి అడ్డరోడ్డులోకి దిగి పది కిలోమీటర్లు వెళ్ళిన తర్వాత ఒక నిర్జన ప్రదేశంలో లారీని ఆపాడు డ్రైవర్. చుట్టుపక్కల అంతా ముళ్ళపొదలు, గుంటలు. లారీలో వచ్చిన ఇద్దరు కూలీల సాయంతో, ఒక గంట సేపట్లో లారీలోని డ్రమ్ములను కిందకి దొర్లించారు వీర్ సింగ్, కేసర్‌సింగ్. పొద్దున్నే వస్తానని చెప్పి కూలీలని ఎక్కించుకొని లారీని తీసుకొని వెళ్ళిపోయాడు డ్రైవర్.

బిర్యాని తింటూ, చెరొక విస్కీ బాటిల్ ఖాళీ చేశారు ఇద్దరూ. తరువాత పనికి ఉపక్రమించారు. ఇనుప రేకులని పగలగొట్టే కత్తి, సుత్తి, ఉలీ తీసుకొని ఒక డ్రమ్ము దగ్గరికెళ్ళి మూత మీద కన్నం పెట్టాడు వీర్‌సింగ్. 'బుస్సు'మనే శబ్దంతో, దుర్వాసనతో వాయువు అతడి మొహాన్ని కమ్ముకుంది. ఛాతిలో మంటతో కళ్ళు తిరిగి నట్లైంది అతడికి. కాళ్ళలో సత్తువ పోగా "మామూ.."అని పిలుస్తూ కూలబడిపోయాడు.

"క్యారే.. క్యాహువా..?" అంటూ అతడి దగ్గరికి వచ్చాడు కేసర్. నీళ్ళ పాకెట్ చింపి, వీర్‌సింగ్ మొహాన నీళ్ళు చిలకరించాడు. వీర్‌సింగ్ కొద్దిగా తేరుకోగానే విస్కీ బాటిల్ మూత తెరిచి నోటికందించాడు. రెండు గుక్కలు తాగి పూర్తిగా తేరుకున్నాడు వీర్. లేచి నిలబడ్డాడు. "మామూ, ఏమిటిది?" మాటలు తడబడుతోండగా అడిగాడు. 'పెయింట్ వాసన, అంతే ఏమీలేదు, పని మొదలుపెట్టు!"అంటూ తొందర చేశాడు కేసర్. మరో గుక్క విస్కీ తాగాడు. తనకొచ్చే డబ్బులు కళ్ళ ముందు మెదులుతుండగా వేరే ఆలోచన లేకుండా పని మొదలుపెట్టాడు వీర్. కేసర్ ఊరికే పైపైన తిరుగుతున్నాడనీ, డ్రమ్ముల జోలికి పోవడం లేదనీ, విస్కీ మత్తులో అతడు గమనించలేదు. పొద్దునకల్లా డ్రమ్ములన్నీ పగలగొట్టి, మెటీరియల్‌ను పారబోసి, డ్రమ్ములన్నిటినీ రేకులుగా కత్తిరించి ఉంచాడు. పొద్దున లారీ రాగానే, రేకులను వేసుకొని విజయవాడ వచ్చారు ఇద్దరూ.

ఒక వారంరోజుల తర్వాత వీర్‌సింగ్‌కు ఛాతీలో తీవ్రంగా మంట మొదలైంది. దానికితోడు విపరీతంగా దగ్గు. గవర్నమెంటు దవాఖానాలో చూపించుకొని, వాళ్ళిచ్చిన మందులు వాడినా తగ్గలేదు. క్రమంగా, దగ్గుతోపాటు రక్తం కూడా పడసాగింది. విపరీతమైన ఆయాసం. లేచి నడవలేని నీరసం. మళ్ళీ దవాఖానాకు తీసుకువెళ్తే, పరీక్ష చేసిన డాక్టరు, ఊపిరితిత్తులు పూర్తిగా పాడైపోయాయనీ, ఇక బతకడనీ, ఇంటికి తీసుకెళ్ళమనీ చెప్పాడు. ఆరోజు సాయంత్రం, చమ్కీ గొల్లున ఏడుస్తుండగా, రెండుమూడుసార్లు రక్తం కక్కుకొని ప్రాణాలొదిలేశాడు వీర్‌సింగ్.

ఆ సాయంత్రం ఫార్మాస్యూటికల్ మందుల కంపెనీ యజమాని, అమెరికన్ కంపెనీనుంచి తమ కంపెనీకి కోట్ల రూపాయల ఆర్డరు దక్కినందుకు అయిదు నక్షత్రాల హోటల్లో పార్టీ చేసుకుంటున్నాడు. ❖

**రచయిత చిరునామా**
**బి.వి.భద్రగిరీష్,**
ప్లాటు నెం.28, కె.పి.నగర్,
బెంజి సర్కిల్ దగ్గర,
విజయవాడ- 8

